# పిన్నికి లేఖ

శరశ్చంద్ర 'సవిత' చదివాను, చివరికి ఓహో ఎంత గొప్పగా రాశాడు అనుకుంటో, అబ్బ ఇంక ఒక్క పేజీ నడవదు అని విసుక్కుంటో, ఇతనింతే అని తిట్టుకుంటో, నా కథలతో పోల్చుకుంటో. శరత్ ఆకర్షణలో ముఖ్యమైన సంగతి అతని పాత్రలమీద అతనిదయ, ప్రేమ-చాలా గొప్ప విషయం. మనిషే చాలా ఎదిగి వుండాలి. అతనికి దేనిమీదా ద్వేషంలేదు. తగాదా లేదు సంఘం మీదగాని, కర్మ మీదగాని, దేవునిమీద గాని, గొప్పకళగల రచనలకి ఒక ముఖ్య సూత్రం అది—ఏదో బలంలేక, నిస్సత్తువగా కాదు. తెలుసుకుని, అనుభవించి, స్తిమితపడి, బలంగా ప్రేమిస్తున్నాడు లోకాన్ని అన్ని లోపాలతోనూ దుఃఖాలతోనూ. తన పాత్రలతో కలిసి ఏడుస్తాడు. సానుభూతి చూపుతాడు; సాయపడతాడు. అంతకన్న అశాంతిని దిఖ్కారాన్ని రేపడు. అందువల్ల బెంగాలీ రస గుల్లాలమల్లే తీపి ఎక్కువౌతుంది. వుప్పూకారం తక్కువౌతాయి. కొన్ని చోట్ల నిజాన్ని ఎదుర్కొని చెప్పగల సాహసమో, బలమో కొరత పడ్డా యనిపిస్తుంది. లేక టాగూరు మల్లే అది ఓ కళానియమంగా పెట్టు కున్నాడో! ఈ పుస్తకంలోంచి తప్ప అతనిసంగతి నాకేం తెలీదుమరి. మనుషుల్ని వాళ్ళ బలాలతో, బలహీనాలతో అర్థం చేసుకోగల ప్రజ్ఞ గొప్పగావుంది— అనేక రకాలైన మనుషుల్ని. కాని ఆ జ్ఞానమంతా చూపడో, చూపతలుచుకోడో !

ఈ కథలో ఒక అరడజనుమంచి స్వార్థరహితుల్ని చేర్చాడు. ఒకర్నిమించినవాళ్ళు ఒకళ్లు, వాళ్ళని వాళ్ల దానాలు చేసుకోవడంలో— చాలా ఘోరం. కొంచెం మనం ఎరిగిన మనుషులవంటివారు ఒకరిద్దరు తొంగి చూస్తారు గాని వాళ్ళని. తెరవెనక్కిలాగేస్తాడు, వాళ్ళపాడు మొహాల్ని ప్రజలకి చూపవొద్దని. ఒకవేళ మామూలు మనుషుల్లో ఆ మంచి భాగమే మనకి కనబరచాలని అతని ఉద్దేశ్యమేమో!

అతని పాత్రల సంభాషణలు మామూలు మనుషులవి కావు. సూటిగా ఒక్కటీ ఆ రెండోవారికి మనకీ అర్థమయ్యేట్టు మాట్లాడరు. ఏదో సమస్యలలో, ఎటుపడితే అటు తప్పించుకోడానికి వీలైనట్టుగా పలుకుతారు. ఆ దొంగతనం అసలు రచయితలోనే వుందనిపిస్తూంది. కొన్నిచోట్ల సంభాషణలు నాకు అర్థంకాలేదు. అది మరి అనువాదం లోపమేమో! అర్థమైనవి కూడా చాలా వంకర తిరుగుళ్ళు. ఒకటే టీ తాగి, తీపి పలహారాలుతిని తియ్యతియ్యగా, వెచ్చవెచ్చగా మాట్లాడి తప్పించుకుంటారు. ఆ మనుషులు ఎదుర్కొంటున్న సమస్యనించి మాటలతో దాక్కోవాలని చూస్తారు కాని అతనిలో సంభాషణా చాతుర్యం, నడకా, అమోఘం. బారువా చిత్రాల్లో మల్లేనే, బయట సమస్యలకన్న హృదయాల్లోని సమస్యలెక్కువ. కొంచెం బుద్ధిమంతుడైన ఆంధ్రుడు వాళ్ళ మధ్యవుంటే, వాళ్ళ జీవిత సమస్యలన్నింటినీ మూడు నిమషాల్లో బుద్ధిచెప్పి తీర్చేవాడనిపిస్తుంది.

భక్తితో పాదధూళులి తీసుకొంటోనే వుంటారు. మర్యాదగా మటుమాయమౌతూ వుంటారు చాలాదొంగలు. 'మీతో మాట్లాడాలి' అంటారు, టీ తాగుతారు, సరేలే సాయింత్రం మాట్టాడదామని వెళ్ళిపోతారు. సాయింత్రమైనా అటూ యిటూ మాట్టాడి, అసలు సంగతి తేల్చుకోకండా వెళ్ళిపోతారు. నిలబడి ఏమిటని ప్రశ్నిస్తే ఏం విరిగి మీదపడుతుందో

నన్నంత ఆత్మలో పిరికితనం. అందువల్లనే వాళ్ళజీవితాలే మాటలు, మాటలు. కాని ఆ మాటల్లో ఎంత గొప్పతనం, చాతుర్యం, మాధుర్యం !

ద్వేషంలో బలం కనపరచడం సులభం. తియ్యని ప్రేమలో బలం చూపడం చాలాకష్టం. ప్రయత్నించాడు శరత్. కాని చూపలేకపోయినాడు.

ఆ సవితని తలుచుకుంటే, నాకు పరమ అసహ్యం. భర్తని వొదిలి ఎందుకు లేచిపోయిందో కూడా ఆమెకే తెలీదట. పదమూడేళ్ళు "అలా, అలా, ఏమీ తెలీకండా గాలిలో, గడియారానికి సంబంధించిన కాలంలో తనకి శరీరమే లేనట్లు, ప్రియుడితో పాపం చేసిందిట" అందరిచేతా ఆమెని ఆరాధింప చేశాడు. కాని నాకేమీ గొప్పరాలేదు ఆమెలోంచి. అటువంటి ఆమెని ఆరాధింప చెయ్యడమే శరత్ గొప్ప. ఎంత దొంగదెబ్బ సంఘం మీద !

తన ప్రేమవల్ల నిజాన్ని మరుగుపరుస్తాడు శరత్. నిజాన్నంతనీ కూడా స్వీకరించి ప్రేమలో జీర్ణించుకునేశక్తి లేదు—ఆ శక్తి కొంచెంగా టాగూరులో, ఇంకా ఎక్కువగా డాస్టనిస్కీ, చకోవ్ మొదలైన రష్యను రచయితల్లో చూస్తాము, అక్కడక్కడ బాల్జాక్ గొప్ప కథల్లోనూ.

అతను ప్రయత్నించిన గొప్ప సంస్కారం, సంఘ బహిష్కృతురాలైన స్త్రీని, అన్నివిధాలా గొప్పదాన్నిచేసి చూపడం. కాని ఆమె మనసులో ఆ నేరభావం కాలుస్తోనే వుంటుంది. 'అట్లా చేసినా, ఆమె గుణవతి' అనిపిస్తాడు, చాలా excuses తో. చివరికి నెట్టాడు బలవంతంగా భర్త సేవలోకి. అందువల్ల ప్రజల సానుభూతిని సులభంగా కొట్టేస్తాడు. తన ఉద్దేశ్యం ఎవరికి ఏ నొప్పి కలగకండా సాధించుకుంటాడు. ఏది వర్ణించినా, ఏ సంఘటనా, దృశ్యమూ చాలా స్పష్టం. మనసులో నిలిచిపోతాయి. కాని అందరు పాత్రలూ మంచితనం, త్యాగం, పాతివ్రత్యం,

మర్యాద, వీటిల్లో నీరసపడి పాకుతారు. మనుష్య ప్రయత్నానికి చాలా తక్కువ ప్రాధాన్యమిచ్చి, ఏదో విధో, కర్మో, వాళ్ళనీ జీవితాన్నీ, మెల్లిగా, తీరుబడిగా, లాక్కుపోతున్నట్టుంటుంది. శక్తి తక్కువ, ఉత్సాహంతో, బలంతో ఇది చెయ్యాలి— అనే దీక్ష తక్కువ ఆ మనుషులకి.

మనుషుల లోపలి లోతైన దృష్టి, గొప్ప సహృదయత, మర్యాద, చాలా మర్యాద మనుషుల యడల, తియ్యతనం, పీటర్ ఛానీ నవలల్లో ఎంత తాగుతారో, చలంకథల్లో ఎన్నిముద్దులు పెట్టుకుంటారో, ఇతని కథల్లో అన్ని కన్నీళ్ళు' ఎప్పుడూ కళ్ళు చెమ్మగిల్లుతూనే వుంటాయి. టీ తాగడం యాడవడం.

ఈ కర్మభూమిలోని నిజమైన జీవితాన్ని చాలా అందంగా చిత్రించాడు, కాని చివరికి ఈ నవలలు చదివి 'ఇంతే జీవితం. ఏం చేతకాదని' నిశ్చింతగా నిద్రపోవడమూ; ఇంతేగతి అని రహస్యంగా ఏడవడమే ఎక్కువౌతుందేమోననుకుంటాను.

నా విమర్శకులు నన్ననేట్టే, నేను శరత్‌ని "శరత్, నీకలంలో అంత దయా, మాదుర్యం, బరువూ, జీవితంమీద గొప్ప విలవా, నిపుణతా, కథ చెప్పడంలో అద్వితీయమైన కౌశలం, వున్నాయి. కాకపోతేనా నిన్ను చీల్చి చెండాడాలన్నంత కోపం వాస్తోంది నాకు" అంటాను.

★